# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వినోద పరిశ్రమకు భారతదేశాన్ని ప్రధాన కేంద్రంగా మార్చడంలో వేవ్స్ సదస్సు ప్రముఖ పాత్ర పోషించనుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **అంతర్రాష్ట్ర నదుల అనుసంధానానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **తెలంగాణ శాసనసభ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమై... మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించనుంది.**
4. **తెలంగాణలో సంక్రాంతి పండగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**
5. **పీఎస్ఎల్వీ సీ-60 రాకెట్‌ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఈరోజు ప్రయోగించనుంది.**

==========================

వినోద పరిశ్రమకు భారతదేశాన్ని ప్రధాన కేంద్రంగా మార్చడంలో వేవ్స్ సదస్సు ప్రముఖ పాత్ర పోషించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమం 117వ సంచికలో పలు విషయాలను ప్రధానమంత్రి నిన్న పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి తన ప్రసంగంలో మహా కుంభ మేళా, రాజ్యాంగ దినోత్సవం, చలన చిత్ర ప్రముఖులు అక్కినేని నాగేశ్వర రావు శతజయంతి, వంటి పలు అంశాలను ప్రస్తావించారు. అలాగే భారతీయ వినోద పరిశ్రమ గొప్పతనం గురించి నరేంద్రమోదీ తెలియజేశారు. వచ్చే సంవత్సరం దేశంలో తొలి సారిగా నిర్వహించబోతున్న ప్రపంచ దృశ్య శ్రవణ వినోద శిఖరాగ్ర సమావేశం-వేవ్స్ గురించి ప్రస్తావించారు. మీడియా, వినోద పరిశ్రమకు చెందిన జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొనే ఈ సమావేశంలో ఆయా రంగాలకు చెందిన నిపుణులు పాల్గొనాలని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 41 సెకన్లు)

--------------------------

అంతర్రాష్ట్ర నదుల అనుసంధానానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలో నదుల అనుసంధానం ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నిన్న జలవనరులశాఖ, ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు

మాట్లాడుతూ, రాష్ట్రానికి కీలకమైన గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ప్రయోజనం కల్పించే ఈ అనుసంధానం ముఖ్యమని తెలిపారు. 70–80 వేల కోట్ల రూపాయాల అంచనా వ్యయంతో దీన్ని చేపట్టనున్నామని,. మూడు నెలల్లో టెండర్లు పిలవాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ సముద్రతీరంలో ఇటీవల ఆలివ్ రిడ్లే తాబేళ్లు మరణిస్తుండటంపై ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని అటవీశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. తాబేళ్లు మృతి చెందడానికి గల కారణాలను తెలుసుకొని, కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. వన్యప్రాణుల పరిరక్షణ చర్యలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా నాలుగు వేల రూపాయల ఫించన్‌ను అందిస్తున్నామన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు ను పూర్తి చేస్తామని మంత్రి పేర్కొంటూ...

వాయిస్ 36 సెకన్లు

---------------------------

తెలంగాణ శాసనసభ ఈరోజు ప్రత్యేక సమావేశం కానుంది. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు శాసనసభ నివాళులర్పించనుంది. శాసనసభ నాలుగో విడతలో రెండో సమావేశంగా దీన్ని నిర్వహిస్తున్నట్లు.. శాసన సభ్యులందరూ హాజరు కావాలని శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు కోరారు. ఈరోజు జరిగే సమావేశంలో మన్మోహన్‌సింగ్ మృతిపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెడతారు. ప్రధానమంత్రిగా ఆయన దేశానికి అందించిన సేవలను తెలియజేస్తారు. అలాగే తెలంగాణ అభివృద్ధి, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రధానిగా మన్మోహన్ సింగ్ అందించిన సహకారంపైనా చర్చించి ఆయన మృతికి సంతాపం తెలియజేయనున్నారు. కాగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో తెలంగాణలో ఏడు రోజులు సంతాపదినాలను పాటించాలని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.

-------------------------

ప్రాథమిక విద్యా బోధన మాతృభాషలోనే జరగాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. విజయవాడలో 2 రోజుల పాటు నిర్వహించిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాషా పరిరక్షణలో ప్రభుత్వంతోపాటు పౌర సమాజం భాగస్వామ్యం కావాలని అన్నారు. తెలుగు భాష పరిరక్షణ, ప్రోత్సాహానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాహిత్య పర్యాటకాన్ని అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. భాషాభివృద్ధికి ఓ కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలి అని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో సంక్రాంతి పండగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రైతు భరోసాపై మంత్రి వర్గ ఉ పసంఘం సమావేశం నిన్న జరిగింది. కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, కమిటీ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ  రానున్న యాసంగి పంటకు రైతు భరోసా అందజేసేందుకు ఖరారు చేయాల్సిన విధివిధానాలపై చర్చించామన్నారు. రైతు భరోసా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని  తెలిపారు.

---------------------------

హైదరాబాద్ నగర అభివృద్ధిలో ప్రాంతీయ బాహ్య వలయ రహదారి కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలంగాణ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రింగ్‌రోడ్డు ఉత్తరం వైపు పనులకు టెండర్లు పిలిచామని తెలిపారు. తెలంగాణలో 50 శాతం రహదారిని ఆర్‌ఆర్‌ఆర్ కలుపుతుందని వెంకట రెడ్డి తెలుపుతూ,

వాయిస్ 36 సెకన్లు

---------------------------

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ–ఇస్రో ఈరోజు ప్రయోగించనున్న పీఎస్‌ఎల్‌వీ సీ–60  రాకెట్ కౌంట్‌డౌన్ ప్రారంభానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సూళ్లురుపేట షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈరోజు రాత్రి 9 గంటల 58 నిమిషాలకు రాకెట్‌ను నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ రాకెట్ ప్రయోగానికి గత రాత్రి 8 గంటల 58 నిమిష్యాలకు కౌంట్‌డౌన్ ను శాస్త్ర వేత్తలు ప్రారంభించారు. పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్‌ఎల్‌వీ కోర్ ఎలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది. ఈ రాకెట్ 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఇస్రో రూపొందించిన స్పాడెక్స్ అనే జంట ఉపగ్రహాలకు ఛేజర్, టార్గెట్ పేర్లను పెట్టామని అన్నారు. ఈ ఉపగ్రహాలు స్పేస్ డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్, మానవ అంతరిక్షయానం వంటి సేవలకు ఉపయోగపడతాయని వివరించారు.

---------------------------

మాదకద్రవ్యాల రహిత తెలంగాణ సాధనే పోలీసు శాఖ లక్ష్యమని డీజీపీ జితేందర్ చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నేర వార్షిక నివేదికను విడుదల చేసి మాట్లాడారు. ఈ ఏడాది కేసుల నమోదు పెరిగిందని, 2 లక్షలకు పైగా కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. కొత్త నేర చట్టాల అమలు కోసం పోలీసులకు శిక్షణ ఇచ్చామని, డిజిటల్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు.

=====================